## క్లుప్తంగా

### అంజన్నకు లక్ష తమలపాకుల పూజ


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అద్దంకి రూరల్: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి శుక్రవారం పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. ముక్కోటి సందర్భంగా దేవాలయ ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేకంగా దీపోత్సవం, శివలింగార్చన, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రకాశం జిల్లా ఎస్పీని కలిసిన కృష్ణచైతన్య


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైతన్య

అద్దంకి: ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికా గర్గ్‌ను రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య శుక్రవారం ఒంగోలులో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పట్టణ నాయకుడు సంది రెడ్డి రమేష్, పలువురు నేతలు ఉన్నారు.

### విద్యాభివృద్ధికి తోడ్పాటు


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న బీవీకే రెడ్డి

అద్దంకి: విద్యాభివృద్ధికి తోడ్పాటు నివ్వాలనే ఉద్దేశంతోనే పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామని పరిమళ ఫౌండేషన్ చైర్మన్ బీవీకే రెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జెడ్పీ నిధులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వూటుకూరి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏపీపీ యర్రమోతు రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు


డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఆర్డీ శ్రీనివాసరావు

చీరాల: సచివాలయాలలోని సిబ్బంది వార్డు ప్రజలకు మెరుగైన సేవలందించాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బోస్‌నగర్, పాపరాజుతోట సచివాలయాలను ఆయన పరిశీలించారు. సచివాలయాల పరిధిలోని పన్నుల వసూళ్లు, రీసర్వే జరుగుతున్న తీరు, సిబ్బంది హాజరు రికార్డులు, స్పందన గ్రీవెన్స్, శానిటేషన్ జరుగుతున్న విషయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఏఈలు పాల్గొన్నారు.

### సీఆర్పీపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

మార్టూరు: విద్యావనరుల కేంద్రంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న రమేష్ అరాచకాలను అడ్డుకొని ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించాలంటూ ఉపాధ్యాయ సంఘాలు శుక్రవారం ఎంఈవో వస్రాం నాయక్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

చీరాల టౌన్: ఇళ్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహకారం అందిస్తుందని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పీఆర్ డీఈ శేషయ్య, ఎంపీడీవో నేతాజీలు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రామ సచివాలయాల డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారిగా లబ్ధిదారులకు జగనన్న లేఅవుట్ కాలనీల్లో కేటాయించిన ఇళ్ల నిర్మాణాల పురగోతిపై పలు సూచనలు అందించారు.

# పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరం కృషి చేయాలి

- ఆమంచికి అభినందనల వెల్లువ


దివ్యాంగుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఆమంచి


ఆమంచి కృష్ణమోహన్‌కు అభినందనలు తెలుపుతున్న కారంచేడు నాయకులు


ఆమంచిని సన్మానిస్తున్న స్టేట్ హిస్టరీ అకాడెమీ డైరెక్టర్ సుబ్బమ్మ


ఆమంచిని కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న వైఎస్ ఎంపీపీ బాబురావు

కారంచేడు: నియోజకవర్గంలో పార్టీని గెలిపించడానికి ప్రతి ఒక్కరం కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం పందిళ్లపల్లిలోని ఆమంచి ఇంటి వద్ద కారంచేడు మండల వైఎస్సార్ సీపీ నాయకులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ, నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నూతలపాటి జోనేష్, పాదర్తి వెంకటరత్నం, తేళ్ల చింపిరమ్మ, షేక్ మీరావలీ, జాగర్లమూడి ఆంజనేయులు, ఆదిపూడి గ్రామ సర్పంచ్ నాగరాజు, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎం ప్రభాకర్‌రెడ్డి నాయకులు ఉన్నారు.

పర్చూరు: మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్‌ను పందిళ్లపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకులు అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలు అందజేసి శుక్రవారం అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, జక్కిరెడ్డి వీరారెడ్డి సంతోష్ రెడ్డి బులిరెడ్డి రామస్వామి రెడ్డి, అంబేడ్కర్ నగర్ ఎస్సీ యూత్ సభ్యులు, హౌసింగ్ డీఈ మురళీ ఈవో నాగయ్య చెరుకూరు గ్రామ కనీ్వనర్ ఉమర్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు భారీగా తరలి వెళ్లి అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త పిడపర్తి సుబ్బారెడ్డి కృష్ణమోహన్ కలిసేందుకు వెళ్లగా కృష్ణమోహన్ మోకాళ్లపై కూర్చొని ఆప్యాయంగా మాట్లాడారు. కార్యక్రమంలో వీరారెడ్డి, సంతోష్ రెడ్డి, బులిరెడ్డి రామస్వామి రెడ్డి, రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌ను చినగంజాం మండలానికి చెందిన పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. మండల వైఎస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, చింతగుంపల నాయకులు కరణం రామకృష్ణ, సంతరావూరు సొసైటీ ప్రెసిడెంట్ కొల్లా వెంకట సుబ్బారావు చౌదరి, గొనసపూడి సొసైటీ ప్రెసిడెంట్ మార్రెళ్ల రామకృష్ణ, కడవకుదురు ఎంపీటీసీ ఆమంచి వెంకట సుబ్బారావు, చినగంజాం మాజీ ఉప సర్పంచ్ ఏ శ్రీరామకృష్ణ, పార్టీ సీనియర్ హబీబుల్లా, శ్రీనివాసరెడ్డి, ఎస్ రామకృష్ణ, పఠాన్ సుభాని, షేక్ సుభాని, దైవాల రామకృష్ణారెడ్డి, రామయ్య, బాజీ, సైదా, బాలు ఉన్నారు.

మార్టూరు: నియోజకవర్గ నూతన ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఆమంచి కృష్ణమోహన్‌ను మార్టూరు ఎంపీడీవో జీ నితిన్ శుక్రవారం కలిసి అభినందనలు తెలియజేశారు. వారితో పాటు ఏపీఓ లక్ష్మీనారాయణ, గర్నెపూడి రవిచంద్, వలపర్ల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## చేనేత పరిశ్రమ అభివృద్ధికి సహకారం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ తిరమలాదేవి

వేటపాలెం: ప్రభుత్వం ఆప్కో ద్వారా చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందించాలిని జెడ్పీటీసీ సభ్యురాలు బండ్ల తిరుమలాదేవి కోరారు. మండల పరిధిలోని పందిళ్లపల్లిలోని గంగా పార్వతీ సమేత పులుగు రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోగల దేవాంగ కళ్యాణ మండంలో బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం సమావేశం గురువారం రాత్రి నిర్వహించారు. సమావేశంలో ఆమె ముఖ్యఅతిగా పాల్గొని మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో 35 వేల మంది దేవాంగ ప్రజలు ఓటర్లుగా ఉన్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు చేనేతలకు చీరాల అసెంబ్లీ సీటు కేటాయించాలని కోరారు. అనంతరం బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా కుర్మా అరుణ్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు, కార్యదర్శిగా పృథ్వీ ఆదిశేషు, ట్రెజరర్‌గా చింతా రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలండర్‌ని ఆవిష్కరించారు.

కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సజ్జా హేమలత, సంఘం అధ్యక్షులు నక్కిన చిన్నవెంకటరాయుడు, మాజీ రాష్ట్ర కార్యదర్శి మాడీశెట్టి శివ వంకరయ్య, పేడన మాజీ మున్సిపల్ చైర్మన్ బండారు ఆనందప్రసాద్, చీరాల జెడ్పీటీసీ పృద్వి అరుణ, కర్ణ లక్షారావు, మాజీ జెడ్పీసీ సభ్యుడు పసుమర్తి వెంకట సుబ్బారావు, బట్టా మోహన్‌రావు, మాచర్ల ప్రసాద్, గుత్తి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## జగనన్న పుణ్యమే పింఛన్ల పండుగ


నూతన పింఛన్ అందిస్తున్న జెడ్పీటీసీ రజనీ, వైస్ ఎంపీపీ

కారంచేడు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుణ్యమే నేడు కొన్ని లక్షల మందికి పింఛన్ల పండుగ వచ్చిందని జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామాల పరిధిలోని 12 సచివాలయాల్లో నూతనంగా ఈ నెల నుంచి 224 మందికి పింఛన్లు అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దారు సుశీలాదేవి, నాయకులు గోగినేని సతీష్‌బాబు, ముల్లా నూర్‌అహ్మద్, కారుమూడి సుబ్బారెడ్డి, యర్రం లక్ష్మారెడ్డి, ఈవూరి మాధవి, మోటాని మధుసూదనరావు, యార్లగడ్డ పాపారావు, చిరుముల సుధాకర్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కేటాయింపు

మేదరమెట్ల: అద్దంకి నియోజకవర్గంలోని 133 మందికి ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటుకు, ఒక్కొక్కరికి రూ.40 వేల రుణం అందించామని ఏరియా కో ఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం సీడ్ క్యాపిటల్ లబ్ధిదారులకు సామర్థ్య పెంపు శిక్షణ తరగతులు మొదటి రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు 7, 9వ తేదీల్లోనూ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సెర్ప్ రిసోర్స్ పర్సన్ వెంకటనారాయణ, ఏపీఎం ఎల్‌హెచ్ మోహనరావు, లోకల్ ఏపీఎం, అద్దంకి లీగల్ కో ఆర్డినేటర్ సీసీ పాల్గొన్నారు.

## ఘనంగా శివ ముక్కోటి ఏకాదశి


చిదంబరేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం

చినగంజాం: ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని శివ ముక్కోటి ఏకాదశిని మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని శివాలయాల్లో శివుడికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. చినగంజాం పౌర్ణమి తిథి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని గంగా పార్వతి సమేత చిదంబరేశ్వర స్వామి దేవాలయం నందు శివ ముక్కోటి ఉత్సవాలు నిర్వహించారు. శుక్రవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం నిర్వహించారు. ఆలయ అర్చకులు కాకుమాను రాము, కొల్లిపర అప్పారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న ఏవో భాస్కరరావు

చినగంజాం: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణదారులపై చట్టపరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కే భాస్కరరావు హెచ్చరించారు. మండలంలోని చినగంజాం, కడవకుదురు, పెదగంజాం గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన శుక్రవారం సందర్శించారు. నాణ్యత లేని ఎరువులు, పురుగు మందులు విక్రయించరాదని, అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు అమ్మరాదని షాపు యజమానులను ఆదేశించారు. దుకాణలలోని స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు నాణ్యత పరీక్ష నిమిత్తం, ఇప్పటి వరకు మండలంలోని ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన షాపులలో విత్తనాలు 8, ఎరువులు 14, పురుగు మందులు 19 శాంపిల్స్ తీసి పరీక్ష నిమిత్తం ల్యాబ్ పరీక్ష కేంద్రాలకు పంపించామన్నారు. మండలంలో పలు దుకాణదారులు ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు అందాయని, అలాంటి దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## భక్తి శ్రద్ధలతో లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చన సేవల్లో పాల్గొన్న మహిళలు

వేటపాలెం: రావూరిపేటలో వేంచేసియున్న చెన్నకేశ్వవస్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన మహోత్సవం శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. సాయంకాలం అమ్మవారికి హారతుల సేవ నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు.

## బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి సాయం


బాలుడి తల్లికి నగదు అందజేస్తున్న దాతలు

చినగంజాం: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చినగంజాం సచివాలయం-2లో మహిళా పోలీసుగా పనిచేస్తున్న రజినీ కుమారుడు కాగిత సుధీర్ వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు సాయమందించారు. 1991–92లో చినగంజాం జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, సంతరావూరు ఎంపీయూపీఎస్, అడివీధిపాలెం ఎంపీపీ, జెడ్పీహెచ్‌ఎస్, చినగంజాం యూటీఎఫ్ మండల శాఖ ఉపాధ్యాయులు కలిసి రూ.25 వేలు నగదును సేకరించి శుక్రవారం బాలుని తల్లి రజినికి అందజేశారు. అడివీధిపాలె ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు ఎస్‌కే నాయబ్ రసూల్, చినగంజాం-2 సచివాలయం ఏఎన్ఎం ఎం స్లాన్లీదేవిలు స్వయంగా నగదును ఆమెకు అందజేశారు.

## భూములు దక్కే వరకు ఉద్యమిస్తాం


రిలే దీక్షలు చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బల్లికురవ: అన్యాక్రాంతమైన పేదల అసైన్మెంట్ భూములు వారికి దక్కేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘల అధ్యక్షుడు దడాల సుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కూకట్లపల్లి రైతులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘల అధ్యక్షుడు మాట్లాడుతూ కూకట్లపల్లి గ్రామ పరిధిలోని 500, 501, 502, 290, 291,292 సర్వే నంబర్లలోని అటవీ భూములను 1980లో డీ నోటిఫై చేసి ఆర్థికంగా వెనుకబడిన పేదలకు, దళితులకు, మాజీ మిలటరీ సైనికులు 300 మందికి 150 ఎకరాల భూమిని పంచారని తెలిపారు. ఆ భూమిని ఆగ్రవర్ణ పెత్తందారులు ఆక్రమించుకుని వారి ఆధీనంలోకి తీసుకుంటే అధికారులు చూస్తూ ఉండిపోయారన్నారు. పేదలకు భూములు తిరిగి ఇచ్చేవరకు పోరాటానికి మద్దతు ఇస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ సీతామహాలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్‌గంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వినోద్‌బాబు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి టి. రామారావు పాల్గొన్నారు.

## రోడ్లపై సంచరించే ఆవులను రక్షించాలి


ఆర్డీవో కార్యాలయం వద్ద మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చీరాల అర్బన్: పట్టణంలోని రోడ్లపై సంచరిస్తున్న ఆవుల్లో కొన్ని ఆవుల శరీరంపై వ్యాధికారక లక్షణాలు కనిపిస్తున్నాయని, వాటిని వెంటనే గుర్తించి వాటిని సంరక్షించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై సంచరిస్తున్న పలు ఆవుల శరీరంపై వ్యాధి కారక లక్షణాలు కనిపిస్తున్నాయని, వీటి వలన మిగిలిన ఆవులకు కూడా వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. యజమానుల ఆధీనంలో ఉన్న ఆవులను వారు సరిగా పరిక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మువ్వల వెంకటరమణరావు అర్వపల్లి కుమార్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

చీరాల అర్బన్: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని టూటౌన్ సీఐ సోమశేఖర్ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని 7వ వార్డులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, ఉజ్వలమైన భవిష్యత్ ముందుందన్నారు. చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు చెడు మార్గాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రుల మాటలు వింటూ ఎటువంటి వివాదాల్లో చిక్కుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సైలు, వార్డులోని యువకులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యుడికి అరుదైన గౌరవం


సత్కారం అందుకుంటున్న వెంకయ్య

మార్టూరు: మండలంలో రాజుగారిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు కొండపల్లి వెంకయ్య తమిళనాడు రాష్ట్రంలోని సిద్ధ వైద్యులచే గురువారం అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. తమిళనాడులోని అట్టిపట్టి చదురగిరి అరణ్య ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పారంపర్య సిద్ధ వైద్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేపీ సెల్వం, సదానందంలు ఆయుర్వేదంలో వెంకయ్య చేస్తున్న సేవలకుగాను ఘనంగా సత్కరించారు. పంచలోహాలతో నిర్మితం అయిన ధన్వంతరి విగ్రహాన్ని మెమొంటోను అందించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

## మిర్చి రైతులను ఆదుకోవాలి


మంత్రి నాగార్జునకు వినతి పత్రం అందజేసిన నాయకులు

జే. పంగులూరు: నష్టపోయిన ప్రతి రైతుకు బీమా వర్తింపజేయాలని పంగులూరు జెడ్పీటీసీ రాయిని ప్రమీల వెంకట సుబ్బారావు సాంఘిక శాఖ మంత్రి మేరుగు నాగార్జునకు వినతి పత్రం ఇచ్చారు. కొరిశపాడు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు జెడ్పీటీసీ వినతి పత్రం ఇచ్చారు. గత మూడేళ్లుగా మిర్చి రైతులు అధిక వర్షాలతో తెగుళ్లతో నష్టపోయారన్నారు. గత సంవత్సరం బీమా అతిక్కువ మంది రైతులకు మాత్రమే అందిందని తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతులకు భీమా వర్తించేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదిరెడ్డి, పంగులూరు రైతులు పాల్గొన్నారు.

## 11న జాతీయ లోక్ అదాలత్

అద్దంకి: ఈ నెల 11వ తేదీన అద్దంకిలోని స్థానిక కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, అన్ని సివిల్ కేసులు, రెవెన్యూ, బీఎస్ఎన్ఎల్, మున్సిపల్, విద్యుత్ తదితర కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. అవకాశాన్ని అద్దంకి, కొరిశపాడు, జే పంగులూరు, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసుకునే విధంగా చూడాలని తెలిపారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతి


వెంకటేష్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న 108 ఉద్యోగులు

చీరాల: 108 కాంట్రాక్టు ఉద్యోగులు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఉద్యోగులు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను కోరారు. శుక్రవారం చీరాల డివిజన్ ఉద్యోగులు వెంకటేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా కృషి చేయడంతో పాటుగా సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆసంఘ సేవల యూనియన్ అధ్యక్షుడు సుబ్బారావు, శ్రీనివాసరావు, భాస్కర్, గాలిరెడ్డి, ఆదాం యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

### వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చీరాల అర్బన్: మున్సిపాలిటిలోని పలు వార్డులలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఐసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఆరు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉండగా వీటిలో ఎస్సీ-1, బీసీ-ఏ1, బీసీ-బీ 2, బీసీ-ఈ1, ఓసీ- 1 ఖాళీగా ఉన్నాయన్నారు. చీరాల ప్రాంతంలో శాశ్వత నివాసులైన వారు, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు వారు, పదోతరగతి పాసైన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూల ద్వారా పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

### శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. దక్షిణాయనం పుష్య మాసం పునర్వసు నక్షత్రం పాడ్యమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీసువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తలకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

### శనగలో చీడపీడలపై అప్రమత్తత అవసరం

జే.పంగులూరు: శనగ పంటలో రబ్బరు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండి నివారించుకోవాలని ఏవో దేవరపల్లి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రబ్బరు పురుగు నివారించకపోతే శనగ రైతులు బాగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. దీని నివారణకు క్వినాల్ ఫాస్ 25 శాతం ఈసీ 2 మి.లీ లీటరు నీటికి, లేదా క్లోరిపైరిఫాస్ 20 శాతం ఈసీ 2.5 మిలీ లీటరు నీటికి, లేదా నొవాల్యూరాన్ 10 శాతం ఈసీ లేదా డైఫ్లూబెంజురాన్ 25 శాతం డబ్ల్యూపీ 1 మిలీ లీటరు నీటికి మందును పురుగు ఉధృతిని బట్టి 2, 3 సార్లు 4,5 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలన్నారు.